కథ

"ఇంకా నిద్రపోలేదా సుజాతా" స్టడీ రూమ్‌లో ఏదో కథ రాసుకోవడం ముగించి వచ్చిన రాజు ఆశ్చర్యంగా అడిగాడు. అతని కళ్లలో అలసట..

"లేదు" మరికొద్ది క్షణాల్లో రానున్న లేట్‌నైట్ న్యూస్ బులెటిన్ కోసం టీవీ తెరపైనే ప్రాణాలు నిలుపుతూ అన్నాను.

వార్తా ప్రసారం మొదలయింది.

"ఏవిటీ అంత శ్రద్ధగా వార్తలు వింటున్నావూ?" రాజు గొంతులో అల్లరి.

"ఉష్.. ఉండు.." అసహనంగా అన్నాను.

బుర్ర పనిచేసినట్టుంది. పెద్ద పెట్టున నవ్వాడు. నేను ఎదురు చూస్తోన్న వార్త వచ్చింది. టీవీ కట్టేసాను. మళ్లా ప్రపంచంలో పడ్డాను. గుర్తొచ్చింది. "అన్నం తిన్నావా?" అడిగాను.

"ఆc!" అన్నాడు రాజు

"అందరం కలసి తింటే బావుండేది. పిల్లలు చూడు- నువ్వొచ్చి కథ చెపుతావని ఎదురుచూసి ఎదురుచూసి నిద్రపోయారు" అనుకోకుండా నా గొంతులో నిష్ఠూరం ధ్వనించింది.

అనునయంగా నవ్వాడు. మంచం మీద ఒరిగాడు. అరక్షణంలో నిద్ర...

ఒళ్లు మండిపోయింది. మొద్దు మనిషి.. ఏ స్పందనా లేని ఈ మనిషికి మళ్లా కథలూ కాకరకాయలూ ఎందుకో!

# సెలవల్లో...

- దాసరి అమరేంద్ర

మెలకువ వచ్చేసరికి బారెడు పొద్దెక్కింది. వంటింట్లో గిన్నెల చప్పుడు...

పని మనిషి వచ్చేసిందా? వెళ్లి చూసాను.

పని మనిషి కాదు. రాజు.

"లేపకపోయావా?"

"ఎందుకూ సెలవు రోజునన్నా కాస్సేపు నిద్రపోనిద్దామనిపించింది.."

"బ్రేక్‌ఫాస్ట్ తిన్నావా?"

"ఏం చేసుకొన్నావూ?"

"బ్రెడ్డూ ఆమ్లెట్టూ"

"పండగ పూట కూడా అవేనా.. హాయిగా ఏ పెసరట్టో వేసి పెట్టేదాన్నిగదా..."

"పండగా?" ఆశ్చర్యంగా అన్నాడు రాజు. అంతలోనే అర్థమైనట్టు నవ్వాడు.

ఆ ఉప్మాలూ పెసరట్లూ నువ్వూ నీ రాక్షస సంతానం తిందురుగాని... నాకు టైమయింది"

" మీకు సెలవు లేదా?"

"మాకా? సెలవా! మాదేవన్నా గవర్నమెంటాఫీసనుకొన్నావా? ప్రైవేట్ సెక్టర్లో ఈ పప్పులుడకవమ్మాయ్.. మీకు రేపూ ఎల్లుండీ కూడా సెలవేట. అంత్యక్రియలు అని అట. శుక్రవారం ఎలానూ పబ్లిక్ హాలీడే గదా. వీకెండ్‌లో కలుపుకొని వరసాగ్గా ఆరురోజులన్నమాట. అరుదైన అవకాశం " వెళుతూ అన్నాడు.

"లంచ్ పెట్టుకొన్నావా?"

"ఆ... ఆ... పెట్టుకొన్నాను" స్కూటర్ స్టార్ట్ చేసి వెళ్లిపోయాడు.

దేనికీ ఆధారపడడు. అది చూస్తే నాకు బెంగ! పదేళ్ల క్రితం పెళ్లయినపుడు నాయనమ్మ సలహా ఇచ్చింది "మొగుడ్ని ఆకట్టుకోడానికి వంట మంచి సాధనం పిల్లా" అని. అప్పట్లో నిజంగానే ప్రయత్నించాను. పడలేదు. అతనికి తిండి ధ్యాసే లేకపోయె! ఇప్పుడు ఆ సలహా గుర్తొస్తే నవ్వొస్తుంది గానీ ఆలోచిస్తే 'ఆ సలహాలో బలంలేకపోలేదు' అనీ అనిపిస్తుంది.

ఆరురోజులు సెలవా!! మైగుడ్‌నెస్. పోయిన ఆ పెద్దమనిషికి నిజంగా జోహార్లర్పించాలి. అన్నిరోజులూ వృథా పోనివ్వకుండా ఏమైనా గట్టి పనులు తలపెట్టాలి..

ఇల్లంతా పరీక్షగా చూసాను.

హాలూ, పడకగదులూ, స్టడీరూమ్- అన్నీ శుభ్రంగానే ఉన్నాయనిపించింది. అయినా ఇంటిని సర్ది యుగాలయినట్టనిపించింది. అందరి ఇళ్లూ ఎంత అందంగా ఉంటాయో... రోజూ ఉద్యోగపు ఉరుకులు పరుగులతో ఇంటిని అందంగా తీర్చిదిద్దే వ్యవధి ఏదీ? ఒక్కరోజు శ్రమపడితే ఇల్లంతా తళతళలాడదూ...

నడుం బిగించాను. హాలుతో మొదలెట్టాను.

పనిలో పని అనుకొని నాలుగేళ్ల పిల్ల రాకాసిని కూడా లేపి ఇద్దరికీ టిఫిన్ పెట్టి ఆడుకొని రండని పార్కులోకి పంపేసాను. సెలవవడం వల్ల అప్పుడే పార్కునిండా పిల్లలు...

మళ్లా పనిలో పడ్డాను.

వాటర్ ఫిల్టరు విప్పదీసి క్యాండిల్‌ను వేడి నీళ్లతో కడిగి బిగించాను. ఫ్రిజ్జంతా ఖాళీ చేసి అన్నిమూలలూ తడిచాను. హాలు కిటికీకి అమర్చి ఉన్న ఎయిర్ కూలర్ని పరామర్శించి నీళ్లు మార్చి ఫానులో రెండు చుక్కలు మెషీన్ ఆయిల్ వేసాను. ఎండిన తివాచీని దులిపి లోపలికి తెచ్చి పరిచాను. క్రోటను కుండీలను మళ్లా హాల్లో అమర్చాను. షోకేసులోని వస్తువులన్నింటినీ వెలికితీసి తుడిచి మళ్లా విభిన్న రీతిలో సర్దాను.

నీరసంగా అనిపించింది. టైము చూసాను. పావుతక్కువ పన్నెండు.

బాప్‌రే! ఇంకా పడకగదులూ, స్టడీరూమ్, స్టోర్‌రూం, కిచన్- అలానే ఉన్నాయి. ఆదరాబాదరాగా తిండి ముగించి మళ్లా పనిలోపడ్డాను.

ఈలోగా పిల్లలు ఆకలంటూ వచ్చారు. అటుకుల పులిహోర చేసి పెట్టాను. ఆవురావురుమంటూ కంచాలు ఖాళీ చేసి మళ్లీ ఆటలకు పరిగెత్తారు. ఎంత ఓపికో!

ఒళ్లు అలసి పులిసినా అద్దంలా తళతళలాడుతోన్న ఇల్లు సంతృప్తి కలిగించింది. రాజు చూసి సంతోషపడడూ? ఆశ్చర్యపడతాడేమో!

"అబ్బ ఎంత నీట్‌గా ఉందండీ! రోజంతా కష్టపడ్డట్టున్నారు" పక్కింటావిడ.

సోఫాలు దులిపాను. రెక్సిన్ని సబ్బునీళ్లతో కడిగాను. తివాచీని తీసి ఎండలో వేసాను. గోడలకు తగిలించి ఉన్న ఇత్తడి షోపీసులను క్రిందకి దించి బ్రాసో పట్టించి బంగారపు మెరుపు తెప్పించాను. హాల్లోని క్రోటను కుండీలను ఎండలో పెట్టాను. డైనింగ్ టేబుల్ తుడిచి శుభ్రం చేసాను. ఓ మూలనున్న ఆక్వేరియంలోని నీళ్లను తోడి తీసి చేపల్ని జాగ్రత్తగా బయటకు లాగి అక్వేరియం రుద్ది కడిగి తాజానీళ్లతో నింపి చేపల్ని మళ్లా అందులో వదిలాను.

మా తొమ్మిదేళ్ల ఘటోత్కచుడు లేచాడు.

"మాతాశ్రీ.. ఆకలి..." టీవీ బాణీలో ఆకలికేకలు వేసాడు. వాడు అలా పిలచినప్పుడల్లా నాకు నేను హిడింబినేమోనన్న అనుమానం వస్తూవుంటుంది" వాడు పుట్టినపుడు కాస్తంత సన్నగా పుట్టాడు. అందరూ 'అయ్యో.. సన్నగా ఉన్నాడే' అనేసరికి చురుకుపుట్టి వాడి పాలనా పోషణల మీద శృతిమించిన శ్రద్ధ చూపించాను. దాని ఫలితంగా ఘటోత్కచుడి చిన్నతమ్ముడయ్యాడు!

అల్పసంతోషిని గదా- గబగబా కాఫీ చేసి ఇచ్చాను.ఇద్దరం హాల్లో కూర్చుని కాఫీ కబుర్లాడుతూండగా రాజు వచ్చాడు. "టచ్‌మినాట్" లాగా పక్కింటావిడ ముడుచుకుపోయి గబగబా నడిచి వెళ్లిపోయింది.

రాజుకేసి ఆశగా చూసాను.

గమనించి నట్టే ఉన్నాడు. అయినా ఉలుకూ పలుకూ లేదు. లోపలికి వెళ్లాడు. గావుకేక వినిపించింది. ఏం కొంప మునిగిందోనని గబగబా వెళ్లాను.

"నా పుస్తకాలు ఏవీ వాటి వాటి స్థానంలో లేవు.." గొంతులో విసుగు, అసహనం.

" సర్దాను."

"ఉద్ధరించావు. లక్షసార్లు చెప్పాను - నా పుస్తకాలు ముట్టుకోవద్దని. పుస్తకాలు అందంగా ఉండవలసింది చూపులకు గాదు చదవడానికి అని. అన్నీ కలగాపులగం చేసావు. నువ్వు చేసిన నిర్వాకాన్ని మార్చి మళ్లీ వీటన్నిట్నీ ఓ పద్ధతికి తేవడానికి నా తలప్రాణం తోకకొస్తుంది. అయినా రోజంతా సర్దిందే సర్దుతూ కూర్చోకపోతే ఏదైనా పనికొచ్చేపని పెట్టుకోవచ్చు గదా."

ఒళ్లు మండిపోయింది. మొగుణ్ని కొట్టే ఆచారం మనకు లేదుగాబట్టే ఊరుకొన్నాను గానీ లేకపోతే గూబగుయ్యి మనిపించాలనిపించింది. రోజంతా పిచ్చిదాన్లా చాకిరీ చేస్తే ఎంత పెడసరం! ఎంత నిర్దయ!! ఎంత కర్కశం!!!

❖ ❖ ❖

రెండోరోజూ బిజీ బిజీగా గడిచిపోయింది.

ఎక్కడెక్కడో పోగుపడిన పాతబట్టలన్నీ తీసాను.

చిరిగిన జేబులు, ఊడిన గుండీలు, కుట్లూడిన పాంట్లు, పిగిలిన జాకెట్లు, ఫాల్ ఊడిన చీరలు, బాబు చొక్కా జేబులకు ఎంబ్రాయిడరీ, పాపకు మేజోళ్లు...

రోజంతా గడిచిపోయింది.

రాజు వచ్చిన సంగతే గమనించలేదు.

మధ్యలో కుట్టు మెషీన్... చుట్టూ బట్టల మేటలు- ఆ అపరిచిత దృశ్యం చూసి రాజు చిరునవ్వు నవ్వాడు.

"అవన్నీ రిపేరు చేస్తూ కుర్చోకపోతే ఏ పేద పిల్లలకో ఇవ్వరాదా. ఎందుకా అనవసరపు శ్రమా?"

రాజు గొంతులో పలికినది సానుభూతేనా?

"బట్టల ధరలు ఎలా మండిపోతున్నాయో తెలుసా" ఉక్రోషంగా అన్నాను.

రాజు హేళనగా నవ్వినట్టనిపించింది. ఏమ్మనిషో!

❖ ❖ ❖

"పిల్లలెప్పుడూ చిరుతిండికోసం తడుముకొంటూ ఉంటారు. ఇవాళ కాస్త కారప్పూసా, జంతికలూ, లడ్డూలు చేద్దామనుకొంటున్నాను. సాయం వస్తారా?" పక్కింటా విడను అడిగాను.

పదింటికల్లా ఇద్దరం పనిలో మునిగిపోయాం.

వంటిల్లూ హాలూ పెళ్లివారిల్లులా ఘుమఘుమలాడాయి.

"జంతిక వాసన... లడ్డూ వాసన..." బకాసురుడి పెద్దన్నలా ప్రవేశించాడు మా ఘటోత్కచుడు. చేసినవి లంచంపెట్టి పనికి అడ్డురాకుండా పంపేసాను.

కారప్పూసా లడ్డూలూ జంతికలూ చేసి డబ్బాల్లో నింపిమూతలు బిగించి ఇల్లు శుభ్రం చేసుకొనేసరికి సాయంత్రమయిపోయింది. రాజు ఆఫీసు నుంచి రానే వచ్చాడు.

పళ్లెంలో కారప్పూసా లడ్డూలూ అందంగా సర్ది అందించాను.

"బావున్నాయ్... ఇంట్లోనే చేసావా? రోజంతా పట్టేసి ఉంటుంది... ఇంట్లో చేసుకోపోతేనేమీ? కొనుక్కోవడానికి మంచి మంచి దుకాణాలున్నాయి గదా..."

"డబ్బులేం చెట్లకు కాయడం లేదు. ఎంత రెండు జీతాలవాళ్లమయినా మరీ అంత విచ్చలవిడి ఆలోచనలు పనికిరావు" సౌమ్యంగా చెపుదామనే మొదలెట్టా గానీమాట కటువుగానే బయటకొచ్చింది.

" అలాగాదు... ఇవాళ అయిన ఖర్చునూ ఇదే సరుకుల్ని బయటకొంటే అయ్యే ఖర్చునూ పోల్చిచూడు. పెద్ద తేడా కనిపించదు"

వితండవాదం. పిల్లల తినుబండారాల విషయంలో కూడా ఏవిటో ఖర్చులూ, పోలికా? ఉండనే ఉందిగదా - చాదస్తపు మొగుడు చెపితే వినడు... అని?



అప్పుడే సగం శెలవలయిపోయాయి. శుక్రవారం వచ్చేసింది.

రాజును గెలవాలన్న పట్టుదల కలిగింది.

అతనికి ఇష్టమైన పని ఏదైనా చేస్తే...

ఆలోచించాను.

రాజుకు పచ్చదనమంటే పరవశం. పువ్వులంటే పిచ్చి..

ఇంటికి ముందూ వెనకా ఎంతో ఖాళీ ఉన్నా, ఇంట్లోనూ బయటా ఎన్నో పూలకుండీలు ఉన్నా సరైన సంరక్షణలేక అవన్నీ 'పుష్పవిలాపం' స్థితిలో ఉన్నాయి.

పనిమనిషిని ఆరోజు అంట్లూ బట్టలూ పక్కన పెట్టి 'వన మహోత్సవానికి' రమ్మన్నాను. సణుగుతూనే వచ్చింది.

ముందు ఇద్దరం కలసి పూలమొక్కల పని చేపట్టాం. చేమంతులు, గులాబీలు, పొద్దుతిరుగుడు పూలు, క్రోటన్లు, ధలియాలు - అన్నింటినీ ట్రిమ్ చేసి మట్టిని తిరగేసి, అవసరమైన ఎరువులు వేసి, చీడ బట్టకుండా స్ప్రే చేసి - అంతా అయ్యేసరికి పన్నెండున్నర.

భోజనం ముగించాను. పనిమనిషికీ పెట్టాను.

కాస్సేపు నడుం వాలుద్దామా అనిపించింది.

"ఆ భావనను జయించి మళ్లీ పనిలో పడ్డాను."

ఈ సారి కూర మళ్లమీదికి దృష్టిని మళ్లించాం.

తవ్వుకోలతో మళ్లలోని మట్టిని కుళ్లబొడిచి పదును చేసి... నీళ్లు పెట్టి "పశువుల పేడ వేసి" రిక్షాలో నర్సరీకి వెళ్లి చిక్కుడూ, బీరా, బెండ విత్తనాలు తెచ్చి మళ్లల్లో నాటి..

అంతా ముగిసేసరికి ఆరున్నర, చీకట్లు కమ్ముకొంటున్నాయి. పనికట్టి పెట్టి తోటనంతటికీ కలయ జూసాను. అలసట తొలిగినట్టనిపించింది.

ఈ రోజు రాజు ఆమోద ముద్ర దొరకడం ఖాయమనిపించింది.

అయినా చిన్న పిల్లలాగా రాజు మెచ్చుకొంటే పొంగడం విమర్శిస్తే కృంగడం ఏమిటి?

రాజు రానేవచ్చాడు. క్షణాల క్రితమే పొంగడాలూ కృంగడాల గురించి హేతు బద్ధంగా ఆలోచించబోయిన మేధస్సును మనస్సు జయించేసి రాజు స్పందనకోసం అత్రుతగా ఎదురు చూడసాగింది.

చుట్టూ చూసాడు. కళకళలాడుతోన్న పూల మొక్కలను చూసి అతని కళ్లల్లో మెరుపు. అంతలోనే ఏదో ఆలోచన భృకుటి ముడిపడింది...

"రోజంతా ఇదే పని పెట్టుకొన్నావా?" పరామర్శా?!

"మీతో వేగడం కష్టం నీకు మొక్కలంటే ఇష్టమని రోజంతా కష్టపడ్డాను. విశ్వాసం లేదు. అసలు ఏం చేస్తే నిన్ను సంతృప్తి పరచగలనో అర్థం కావడం లేదు" ఇంకాస్త సాగితే కన్నీటికుండ బద్దలవుతుందేమోనని భయంవేసింది.

"నన్ను సంతృప్తి పరచడమేమిటి? ఎందుకూ?" అర్థంగానట్టు అడిగాడు.

"కట్టుకొన్న పాపానికి. పదేళ్లుకాపురం చేసిన పాపానికి"

"ఆవేశపడక. రోజంతా గార్డెన్లో నువు చేసిన కష్టం నేను గమనించలేదనుకోక. కానీ పువ్వులూ పచ్చదనమూ కావాలంటే పార్కులూ అడవులూ లేవా? మనకున్న కాస్తంత తీరిక సమయాన్ని వీటికి వాడేసేబదులు మనలాంటి వాళ్లు చెయ్యడానికి మరెన్నో ముఖ్యమైన పనులు లేవూ?!"

"నాకు తెలుసు నీ వితండవాదం. మరింకో పని పెట్టుకోకుండా పొద్దస్తమానం పుస్తకాల్లో మునిగి పోవడమేనా నువు చెప్పిన ముఖ్యమైన పని? అది నాకు సోమరి తనమనిపిస్తుంది. కంపరం పుట్టిస్తుంది. నువ్వసలెలాగంటలతరబడి రోజుల తరబడి ఆ పుస్తకాల మధ్య గడుపుతావో నాకర్థంగాదు.

"అంత బాధ్యతా రహితంగా నేనుండలేను. నువ్వు కష్టపడకపోతే పోయె - కనీసం ఒళ్లు ఒంచి కష్టపడేవాళ్లకి ఓ సానుభూతి మాట మాట్లాడితే నీ సొమ్మేం పోయిందీ..."ఝాడించి వదిలాను.

❖ ❖ ❖

శనివారం వచ్చేసింది. ఆదివారమంటే ప్రతీ ఆదివారంలానేగడుస్తుంది గదా- అనుకోకుండా వచ్చిన స్పెషల్ శెలవలకీ శనివారమే ఆఖరి రోజన్నమాట...

మళ్లా ఈ జన్మలో ఇలాంటి అవకాశం వస్తుందో రాదో...

బంగారంలాంటి సెలవల్ని అడవిగాచిన వెన్నెల లాగా ఇంటి పనులకే ఖర్చుపెట్టేసాను...

ఖర్చయితే అయింది - దానికి తగ్గ గుర్తింపులేదు... మర్యాదలేదు.. మన్నన లేదు... విరక్తి పుట్టింది.

ఎందుకొచ్చిన తాపత్రయం? రాజులాగే హాయిగా కాళ్లు బార్ల జాపుకొని ఏదైనా పుస్తకం చదువుకొంటే పోలేదూ!

అదే సరి అయిన పని అనిపించింది.

రాజు పుస్తకాలు వెదికాను.

తెలిసిన పుస్తకం ఒక్కటీ కనిపించలేదు. ఏవేవో పరిచయంలేని పుస్తకాలు... తెలుగూ ఇంగ్లీషూ - రాజు రెగ్యులర్గా పుస్తకాలు సేకరించి చదువుతున్నాడు గానీ తనకు తీరికెక్కడిదీ? ఇల్లు.. పని.. పిల్లలు... ఆఫీసు - ఇవి చాలవూ? పుస్తకాలు చదివే వ్యవధి కూడానా?!

కథలూ నవలలూ కననిపించలేదు గానీ ఏదో నీలిరంగు కవితా సంకలనం.

పనిలో పనని పేరు తెలిసిన సోమర్సెట్మామ్ గారి 'దిమూన్ అండ్ సిక్స్ పెన్స్' కూడా చేత బట్టాను...

రైటో... ఈ శనివారం సోమరిగా గడుచుగాక...

కవితా సంకలనం తెరిచాను. స్త్రీ వాద కవితలట అవి...

"పైటను తగలెయ్యాలి..." తగలేసి? పాంట్లు వేసుకోవాలి... జుట్లు కత్తిరించుకోవాలి. మగవాళ్లను కాల్చుకు తినాలి. పిల్లల్ని గాలికి వదలాలి- ఇదేగదూ ఫెమినిజం.

'అవును మేము గయ్యాళులమే.' మాతల్లే. ఎంత నిజాయితీ!

ఎందుకీ అక్కరకు రాని శతృత్వం? హక్కుల కోసం నోరు పెట్టుకొని అరిచి సాధించి బాధ్యతలను మాత్రం పట్టించుకోని ఈ ఫెమినిజం వల్ల ఏమిటి లాభం?! అయినా ఎలానూ తెరిచా గదా అని చదవడం మొదలెట్టాను.

పీఠిక.

రెండో పేరాలోకి వచ్చేసరికి పరుపు మీద దిండుకు తల ఆన్చి పవ్వళించిన దాన్ని కాస్తా తిన్నగా లేచి కూర్చుని దీక్షగా చదవనారంభించాను.

రెండో పేజీ దగ్గర కొచ్చేసరికి పక్కవదిలి రైటింగ్ "టే"బులు దగ్గరకు చేరాను. అసంకల్పితంగానే చేతిలోకి కాలమూ కాగితమూ... ముఖ్యమైన పాయింట్లను నోట్ చేసుకోవడం..

రెండు వందల ఇరవై ఎనిమిదో పేజీ ముగిసేసరికి మధ్యాహ్నం పన్నెండున్నర,,,

మరో ప్రపంచపు కవాటాలు తెరుచుకొని స్వేచ్ఛా పవనాలు వీస్తోన్న భావన... ఆ ప్రభంజనపు ఉరవడిలో సంతోషంగా కొట్టుకుపోతోన్న భావన... ఎన్నో ప్రాథమికాంశాల మీద స్పష్టమైన అవగాహన... ఆవేశం, ఆక్రోశం, ఉత్సాహం, ఉద్వేగం, స్ఫూర్తి ... ఉక్కిరి బిక్కిరి...

మనసుకు నచ్చిన కొన్ని గేయాలను మరోసారి చదివాను. ఒక్కొక్కటి చదువుతోంటే 'అవును సుమా' అనిపించింది.

ఏదో ఆందోళన.. అశాంతి; అయినా ఏదో సంతృప్తి.. సంతోషం - ఏదన్నా చెయ్యాలన్న తపన... తాపత్రయం...

సోమర్సెట్ మామ్గారినీ చదవాలనిపించింది. మధ్యాహ్నమంతా ఆ 'మూన్ అండ్ సిక్స్ పెన్స్'.

చందమామ గదా చల్లగా ఉంటుందేమోనని వెళితే మనస్సులో సాగర మథనం.

నవల ముగించేసరికి ప్రపంచం కొత్తగా కనబడ సాగింది.

జీవితమంటే చిన్ననాటి నుంచీ మనసులో జీర్ణించుకు పోయి ఉన్న భావాలు చెదరి - మధ్య తరగతి విలువలూ, మిధ్యా గౌరవాలూ, పరుగుల బతుకూ అర్థం లేనివిగా కనిపించ సాగాయి.

మనిషికి ఆలంబన భౌతిక జీవితమా మానసిక ప్రపంచమా? మనిషిని కదిలించేది శారీరక సుఖాలా అంతరంగ జ్వలనమా? ఆ నవలలోని ముఖ్య పాత్రలాగా.

"నిక్షేపం లాగా వృత్తినీ 'పెన్నిధి' లాంటి కుంటుంబాన్నీ వదులుకొని తన మనసుకు నచ్చిన చిత్ర కళకోసం - డబ్బు, కీర్తి ప్రతిష్టలను గురించిన స్పృహ లేకుండా - జీవించడం సామాన్య మానవులకు సాధ్యమేనా?! అది వాంఛనీయమేనా?!

ఈ సమాజం, ఈ కుటుంబ వ్యవస్థ, ఈ చదువులూ ఉద్యోగాలూ - ఇవి మన సుఖసౌఖ్యాలకు కేంద్ర బిందువులా లేక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అవరోధాలా?!

ఎన్నో ఆలోచనలు...

ఒక్కమాట నిజమనిపించింది....

జీవితాలను మార్చగల, మలచగల శక్తిపుస్తకాలకు ఉంటుందంటారు - ఆ మాట నిజమనిపించింది.

ఈనాడు చదివిన రెండు పుస్తకాల ముందటి తన జీవితానికీ, తరువాతి జీవితానికీ ఎంతో తేడా ఉంటుందన్నమాట నిజం...

రాజు వచ్చాడు. తను గమనించనేలేదు.

నన్నూ, రైటింగ్ టేబుల్నీ, కాగితమూ కలాలనూ, టేబుల్ మీది పుస్తకాలనూ ఎంతో ఆశ్చర్యంగా చూసాడు.

"ఏం చదువుతున్నావు సుజాతా" అడిగాడు.

దగ్గరకు వచ్చి పుస్తకాలను తెరచి చూసాడు.

మొహం విప్పారింది.

అతని కళ్లల్లో ఎంతో అరుదుగా కనిపించే మెరుపు.

ఎందుకో ఆ సంతోషం... ఆ మెరుపు...

ఎందుకో తనకు తెలియదూ?!